క్లుప్తంగా

ఆధ్యాత్మిక శోభ సంతరించాలి



అయిజ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవాలని వీరాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురంలో వీరాంజనేయస్వామి ఆలయంలో సమావేశమయ్యారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఇల్లు వాకిలి శుభ్రం చేసుకొని, ప్రత్యేకంగా అలంకరించి పండుగ చేసుకోవాలని సూచించారు. శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ రోజు సాయంకాలం గ్రామంలోని ఆలయంలో భజన, కీర్తనలు, ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో గోపాల్, సూర్యనారాయణ, శేఖర్, లింగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు పూర్తి చేయండి



మానవపాడు: మండలంలోని బోరవెల్లి నుంచి మానవపాడు జాతీయ రహదారి–44కి వెళ్లే రహదారి కంకర తేలడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. అసంపూర్తి రోడ్డుతో చాలా రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

వేగంగా భారత్‌మాల పనులు



రాజోళి: భారత్‌మాల ద్వారా జరుగుతున్న ఆరులైన్ల రహదారి పనులు మండలంలో వేగంగా జరుగుతున్నాయి. మండల కేంద్రం నుంచి శాంతిగనర్ మధ్యలో వెళ్తున్న ఈ రహదారి బుడమరుసు మీదుగా నిర్మాణం కానుంది. రోడ్డు పనుల్లో భాగంగా మట్టిని ఏర్పాటు చేసి చదును చేయడం, వెడల్పు చేయడం వంటి పనులు, అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించేందుకు పనులు చేస్తున్నారు. రాత్రి పూట కూడా పనులు జరుగుతుండటంతో పనుల్లో వేగం పెరిగింది. రైతులకు రావాల్సిన పరిహారం పూర్తి స్థాయిల్లో కొలిక్కి రాకపోవడం, పొలాలకు వెళ్లే మార్గాల్లో ఇబ్బందులను పరిష్కరించకుండా పనులు వేగంగా చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తి అయ్యాక తమ సమస్యలను పరిష్కరిస్తారా లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా మాధవస్వామి ఉత్సవాలు

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో మాధవస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, బిందె సేవ, విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి ప్రభోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల శ్రమదానం



అయిజ: మండలంలోని అయిజ–తూంకుంట గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ వారు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ఆదివారం 18 మంది ఆటో డ్రైవర్లు శ్రమదానం చేసి రోడ్డుపై పడిన గుంతలకు మట్టి వేసి మరమ్మతు చేశారు. నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా ఏర్పాటు చేసిన కాల్వ నుంచి పంట పొలాలకు సాగునీరందించేందుకు రోడ్డుకు ఇరువైపుల పంటపొలాలున్న రైతులు అనేక చోట్ల రోడ్డును తవ్వి పైప్‌లైన్ చేశారు. దానివల్ల రోడ్డు శిథిలమైంది. కనీసం మోటార్ సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దానివల్ల ఆటో డ్రైవర్లు రోడ్డు మరమ్మతుకు నడుంబిగించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. శ్రమదానం చేసిన ఆటో డ్రైవర్లలో మస్తాన్, జమ్మన్న, శేషన్న, కిష్టన్న, మనోహర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

- భోగి మంటలు, ఇళ్ల ముందు రంగవల్లులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- హరిదాసుల, గంగిరెద్దుల ఆటపాటలు
- గ్రామాల్లో క్రీడలు, ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



గద్వాలలో రంగవల్లులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల: సంక్రాంతి పండగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ఆదివారం 24వ వార్డులో కౌన్సిలర్ శ్రీనివాసులు, రామాలయం చైర్మన్ జానకీరాములు సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలతో రాంనగర్ కాలనీ మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. పలువురు మహిళలు వేసిన ముగ్గులలో సంక్రాంతి సొరభాలు వెల్లువిరిశాయి. గంగిరెద్దులు, చెఱకు గడలు, నవధాన్యాలు, సన్నాయి అప్పన్నలు, హరిదాసులు, భోగి మంటలు, రేగుపండ్లు, కాయగూరలు, పలు దేవతా మూర్తుల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రజలు భోగ భాగ్యాలతో ఉండాలి

సనాతన సంప్రదాయాలను భావితరాలు అలవరచుకొని, భోగ భాగ్యాలతో జిల్లాలోని ప్రతి గడప సుఖ సంతోషాలతో తులతూగాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అభిలషించారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులను అందజేశారు. తెలుగు సాంప్రదాయాన్ని కాపాడేలా ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు.

కేటీదొడ్డి: సంక్రాంతి పండుగ భోగి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఇళ్లముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో గ్రామాల్లో కొత్త కాంతులు కనిపించాయి. పతంగులు ఎగురవేస్తూ చిన్నారులు ఆనందంతో చిందులు వేస్తూ భోగి చేసుకున్నారు.

ధరూరు: మండల కేంద్రంలో మహిళలు, యువతులు వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఉండవెల్లి: మండలంలో రంగు రంగుల ముగ్గులతో.. భోగి మంటల్లో యువత, మహిళలు ఆనందంగా పండుగ నిర్వహించారు. పుల్లూరులో భోగిమంటలతో అలరించారు.

గట్టు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటి రోజు భోగి మంటలతో చలి కాచుకున్నారు. ఇళ్లోని పాత వస్తువులను భోగి మంటల్లో వేసి, మంటల చుట్టూ ప్రదక్షణలు చేశారు. భోగి రోజున చిన్నారులపై రేగిపళ్లను వేశారు. బల్గెర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి నర్సమ్మ, ద్వితీయ బహుమతి మౌనిక, తృతీయ బహుమతి కవితలు దక్కించుకున్నారు. విజేతలకు జెడ్పీటీసీ బాసు శ్యామల అందజేశారు.

మల్దకల్: మండలంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. రైతులు సిరిధాన్యాలను, రేగుపళ్ళను గొబ్బెమ్మలలో పోసి ముగ్గుల్లో ఏర్పాటు చేశారు. హరిదాసులు, గంగిరెద్దులు ఇంటింటికీ తిరుగుతూ కీర్తనలు పాడారు. చిన్నారులు కేరింతలలో గాలిపటాలు ఎగురవేశారు. చుట్టాలతో గ్రామాలు సందడి సందడిగా మారాయి. ఈ పండుగ సమయానికి పంటలు చేతికి రావడంతో పాడిపశువులను భక్తిశ్రద్ధలతో పూజించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో భోగి పండుగ ఘనంగా చేశారు. ముగ్గులు, భోగి మంటలు వేసి పిల్లలు, పెద్దలు సంబరాలు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పండుగ సంబరాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

రాజోళి: మండలంలో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. నువ్వుల నూనెతో నలుగు పెట్టుకుని ప్రత్యేక స్నానాలు చేశారు. మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో ఉదయం నుంచే కోలాహలం మొదలైంది.



బల్గెరలో ముగ్గుల పరిశీలన



మల్దకల్‌లో ముగ్గు వేస్తున్న మహిళ



ఎర్రవల్లిలో భోగి పండ్లు పోస్తున్న దంపతులు



గట్టులో..



అమరవాయిలో ముగ్గు వేస్తున్న మహిళ



అయిజలో తిమ్మప్ప స్వామి ఆలయంలో భక్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

గద్వాల: దయానంద విద్యా మందిర్ పాఠశాలలో చదివి ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు చేస్తూ.. పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా మళ్లీ కలిశారు. చిన్ననాటి స్మృతులు జ్ఞాపకం చేసుకుంటూ పాఠశాలలో రోజులు గుర్తు చేసుకున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 50 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బండ్ల నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పూర్వ విద్యార్థులు అవకాశం లభించినప్పుడల్లా సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు గోవింద్‌రావు గణప్ప, చిలువేరి శ్రీనివాసులు, కన్వీనర్ పుట్ట శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హరనాథ్‌రెడ్డి, హెచ్‌ఎం సత్యకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ధరూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు రేవులపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థిని కే.జ్యోతి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవీంద్ర బాబు, పీ ఈటీ రజనీకాంత్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ అండర్ –14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. గతేడాది అక్టోబర్ నెలలో వనపర్తి జిల్లా కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరిగనున్న రాష్ట్ర పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన జోలాపురం బజారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విజయుడు ఆదివారం పరామర్శించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల సమాచారం మేరకు ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామన్‌పాడుకు నీటి నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని సమాంతర కాల్వవ ద్వారా నీటిని నిలిపివేశారు.

సదరం కోసం లక్కుండాలి

- వైకల్య పరీక్షలకు స్లాట్ బుకింగ్‌కు అవస్థలు
- క్షణాల్లో క్లోజ్ అవుతున్న సైట్
- మీసేవ కేంద్రాలకు చేరుతున్న వికలాంగులు



స్లాట్ బుకింగ్ కోసం మీసేవ కేంద్రంలో వేచి చూస్తున్న బాధితులు

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు ఇతర కారణాలతో శారీరక వైకల్యానికి గురైన వారు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ పొందడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ పొందడానికి ప్రభుత్వ ప్రవేశ పెట్టిన సదరం సర్టిఫికెట్ ప్రామాణికం కాగా, సర్టిఫికెట్ పొందేందుకు ముందుగా డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వైకల్యం పొందిన వారికి స్లాట్ బుకింగ్ పెద్ద పరీక్షగా మారింది. కిలోమీటర్ల దూరంలో ఉన్న మీ సేవ కేంద్రాలకు చేరుకున్న క్షణాల్లో సైట్ ఓపెన్ క్లోజ్ అవుతోంది. దీంతో ఇటు వైకల్యానికి గురైన వారితో పాటు అటు మీసేవ నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయాన్నే మీసేవ కేంద్రాలకు..

సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఉదయాన్నే మీసేవ కేంద్రాలకు శారీరక వికలాంగులు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నారు. స్లాట్ బుకింగ్ క్షణాల్లో సైట్ ఓపెన్ కావడం అంతల్లోనే క్లోజ్ కావడంతో లక్కు ఉన్న వారికే స్లాట్ బుకింగ్ అన్న చందంగా మారింది. ఇలా నెలల తరబడి తిరుగుతూ వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

బుకింగ్ కావడం లేదు..



ప్రమావశాత్తు కిందపడటంతో నాకు కాలు విరిగింది. అప్పటి నుంచి పనులకు వెళ్లకుండా ఇంటి దగ్గరనే ఉంటున్న. వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని మీసేవ కేంద్రానికి వస్తే స్లాట్ బుకింగ్ కావడం లేదు.

– వీరన్న, నందిన్నె

క్షణాల్లో క్లోజ్ అవుతుంది



నా కొడుకుకు పుట్టినప్పటి నుంచి పూర్తిగా కాలు పనిచేయడం లేదు. సదరం సర్టిఫికెట్ ఉంటేనే పింఛన్ వస్తుందని రెండు నెలలుగా మీసేవ కాడికి వస్తున్నా స్లాట్ కావడం లేదు. క్షణాల్లో బుకింగ్ క్లోజ్ అవుతోంది.

– ఎల్లప్ప, వెంకటాపురం

నెలకోసారి సమయం..



నా కూతురికి పుట్టినప్పటి నుంచి మాటలు రావడం లేదు. స్లాట్ బుకింగ్ కోసం ఐదు నెలలుగా తిరుగుతున్నా బుకింగ్ కావట్లేదు. నెలకోసారి మాత్రమే స్లాట్ బుకింగ్ సమయం ఇస్తున్నారు. పాత పద్ధతిలోనే పరీక్షలు చేయాలి.

– జిందప్ప, గువ్వలదిన్నె

ఇబ్బంది పడుతున్నాం..

సదరం సర్టిఫికెట్ పొందేందుకు ముందుగా మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. నెలకోసారి సమయం ఇస్తున్నారు. తక్కువ సమయంలో నిర్ణీత సంఖ్యలో బుకింగ్ అవుతున్నాయి. వందల మంది వస్తే ఒక్కరిద్దరికే బుకింగ్ అవుతోంది. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– వెంకటేష్ నాయుడు, మీసేవ నిర్వహకుడు

గోదారంగనాథస్వామి కల్యాణం



సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గద్వాల: పవిత్ర ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం పెద్ద అగ్రహారంలోని అహోబిలమఠం, భీంనగర్‌లోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో, సాయంత్రం 6 గంటలకు స్థానిక రాజవీధిలోని రంగనాథ స్వామి ఆలయంలో వేరువేరుగా నిర్వహించిన కల్యాణోత్సవాలు కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతి హోమం, గరిక పూజ, తలంబ్రాలు, మాంగల్యధారణ, ఒడి బియ్యంతో పాటు స్వామి వారికి కానుకలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



యాపదిన్నెలో క్రికెట్ ఆడుతున్న యువకులు

అయిజ: మండల పరిధిలోని యాపదిన్నెలో చల్లా ఫ్యాన్స్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉల్లాసంగా కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి మొత్తం 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు. మల్దకల్ మండలం ఎల్కూరు ఫ్రెండ్స్ టీం, జూలెకల్ టీం, గద్వాల టీం, కింగ్ రాయల్స్ యాపదిన్నె జట్లు సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో తలపడనున్నట్లు నిర్వాహకులు ఆనందరాజు, ఉమేష్, మౌలాలి, భాస్కర్, రవిలు తెలిపారు. ఫైనల్ పోటీల అనంతరం విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు నగదు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

వాల్మీకి బోయలు కలిసి పనిచేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అయిజ: వాల్మీకి బోయల సామాజిక వర్గం అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర మాజీ కన్స్యూమర్ చైర్మన్ గట్టు తిమ్మప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాల్మీకి ఆలయం వద్ద వాల్మీకి యువజన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దశాబ్దాల కాలంగా వాల్మీకి బోయలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వ్యాపార, రాజకీయం రంగంల్లో తగినంత పురోగతి సాధించలేదని వాపోయారు. వాల్మీకి బోయల సమాజిక వర్గం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్క వాల్మీకి బోయ కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బాసు హనుమంతు, మాజీ జెడ్పీటీసీ చిన్న హనుమంతు, జిల్లా వాల్మీకి నాయకులు కోటేష్, టీచర్ రంగన్న, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతల పంపిణీ



ఇమాంపూర్‌కు చేరుకున్న రాముడి అక్షతలు



పాగుంటలో అక్షతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అయోధ్య రాముడి అక్షతలు గ్రామగ్రామాలకు చేరుతున్నాయి. ఆదివారం అలంపూర్ పట్టణంలోని ఇమాంపురం కాలనీలో అయోధ్య రాముడి అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భక్తులు సైతం అయోధ్య రాముడి అక్షతలు ఇంటికి చేరుతున్నాయని తెలిసి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకుని స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, మద్దిలేటి, రాజశేఖర్, శ్రీనివాస్‌లు, అయ్యన్న, బలరాముడు, నాగరాజు, తులసీరెడ్డి, ఈదన్న, రాముడు, బాబురావు, వీరాంజనేయ స్వామి భజన బృందం పాల్గొన్నారు

కేటీదొడ్డి: ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షతలు చేరాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు అన్నారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలకు కేటీదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాగుంట గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికీ తిరుగుతూ అక్షతలు పంపిణీ చేశారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీమన్నారాయణ స్వామివారి కల్యాణోత్సవం

ఆత్మకూర్: ధనుర్మాసం సందర్భంగా ఆత్మకూర్ పట్టణ శివారులోని అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో శ్రీగోదలక్ష్మినారాయణస్వామి వారి తిరు కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుఝాము నుంచి అభిషేకం, విశ్వక్సేనారాధన, సంప్రోక్షణ, దేవతార్చనం పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కల్యాణోత్సంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అలాగే భక్తలకు అన్నదానం, ప్రసాదం పంపిణా చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శేషాచార్యులు, సాకేత్‌చార్యులు, ఆలయ ధర్మకర్తలు పాశం గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కుటుంబాల స్థితిగతులపై అధ్యయనం



నెలివిడిలో విద్యార్థుల అవగాహన

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబ స్థితిగతులపై అధ్యయం చేస్తున్నారు. మదనాపురం మండలంలోని నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రవేఫ్ విద్యార్థినులు అంగన్‌వాడీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువజన దినోత్సవం భవిష్యత్‌ను రూపొందించడంలో యువత కలిగి ఉన్న సామర్థ్యాన్ని శక్తిని గుర్తించిందని ఆమె వెల్లడించారు. యువతలో సానుకూల మార్పును తీసుకురావడంలో వారి పాత్రను గుర్తిస్తూ, యువతరానికి వారి ప్రయత్నాల్లో సాధికారత మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉండటం లాంటి విషయాలను గూర్చి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు మేఘన, రచన, సుష్మ, చరణ్య, గీత, రసజ్ఞ, పావని తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజోళి: అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుకను ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న ధన్వాడలో గల తుంగభద్ర నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు ట్రాక్టర్లను నిలిపి ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాదర్ బాషా తెలిపారు.